ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5, కనిష్ఠం 19.2

5
కామారెడ్డి
జిల్లా వార్తలు
గురువారం 1 ఫిబ్రవరి 2024

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శీతాకాల శిబిరం ప్రారంభం

కామారెడ్డి రూరల్, జనవరి 31: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ రెండో యూనిట్ విద్యార్థుల శీతాకాల ప్రత్యేక శిబిరం కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ శిబిరం ఏడు రోజుల పాటు కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామంలో డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. గ్రామంలో చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించి పచ్చదనం పరిశుభ్రత గురించి తెలిపారు. ఆ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె కిష్టయ్య, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ శంకరయ్య, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ పి.రాజ్‌గంభీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం కరుణించేనా?

- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల్లో ఆశలు
- నేడు కేంద్ర ప్రభుత్వ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్
- కలగానే మిగిలిన బోధన్-బాన్సువాడ-బీదర్ రైల్వేలైన్
- దశాబ్దాలు గడుస్తున్నా తీరని గేటు కష్టాలు
- రైల్వే డబ్లింగ్‌కు నిధులు మంజూరు చేసేనా?
- కేంద్ర ప్రభుత్వానికి నేటి చివరి బడ్జెట్
- పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల

కామారెడ్డి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి చివరి బడ్జెట్ కానుంది. పార్లమెంట్‌లో గురువారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ సమావేశాలు ముగియగానే లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. మరో నెల రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనుండగా కేంద్రం ఎలాంటి బడ్జెట్ ప్రవేశపెడుతుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంటుంది. ఎన్నికల సందర్భంగా కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. ఈ బడ్జెట్‌లోనైన జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రాజెక్టులపైన అయిన కరుణిస్తుందో లేదో చూడాలి.

రైల్వే డబ్లింగ్‌కు నిధులు మంజూరు చేసేనా?

దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ముఖ్కేడ్- నిజామాబాద్-బాసర-కామారెడ్డి-హైదరాబాద్ వరకు రైల్వే డబ్లింగ్ లైన్‌కు గత ఐదు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. డబ్లింగ్ లైన్ వేసేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సైతం కేటాయించింది. మహారాష్ట్రలోని ముఖ్కేడ్ నుంచి నిజామాబాద్ బాసర - కామారెడ్డి - హైదరాబాద్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని డోన్ వరకు సుమారు 417కిలో మీటర్ల మేర రైల్వేలైన్ డబుల్ లైన్‌గా మార్చడానికి రూ.4,600 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు మంజూరు చేసి 8 నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ డబ్లింగ్ లైన్‌కు కేంద్రం నిధులు మంజూరు చేసినప్పటికీ నిధులను విడుదల చేసి పనులు ప్రారంభిస్తే దశాబ్దాల కల నెరవేరనుంది. ఈ డబ్లింగ్ లైన్ పూర్తయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రైళ్ల రాకపోకలు మరింత పెరుగుతాయి. రవాణా సౌకర్యం సైతం మెరుగుపడనుంది. ఈ డబ్లింగ్ లైన్ పనులకు కేంద్రం ఈ బడ్జెట్‌లోనైన నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాన్సువాడ-బోధన్-బీదర్ లైన్‌కు పచ్చజెండా ఊపేనా?

వెనుకబడిన ప్రాంతమైన బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాలకు రైల్వే సదుపాయం కల్పించేందుకు గాను బాసర నుంచి బోధన్-బాన్సువాడ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ వరకు రైల్వేలైన్ వేయాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. బాన్సువాడ-బీదర్ మధ్య దూరం 140 కి.మీలు బాన్సువాడ - బోధన్ - బీదర్ రైల్వేలైన్ మంజూరుకు కృషి చేస్తామని ఎన్నికల సమయంలో నేతలు హామీలు ఇస్తూ వచ్చారు కానీ లైన్ మంజూరుకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఇక్కడ ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చేందుకు ఏ ఒక్కరూ కూడా గట్టిగా ప్రయత్నించిన పాపాన పోలేదు. దీంతో ఈ రైల్వే లైన్ కలగానే మిగిలిపోతుంది. ఈ లైన్ కోసం గతంలో సర్వే కూడా చేశారు. ఆ తర్వాత మరిచిపోయారు. అలాగే కరీంనగర్ నుంచి పిట్లం వరకు కేకేవై (కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి) జాతీయ రహదారి నిర్మించాల్సి ఉంది. ఏళ్ల తరబడి ఈ జాతీయ రహదారి మంజూరైనప్పటికీ ఈ పనులకు నిధులు మంజూరు చేయడం లేదు. ఈ బడ్జెట్‌లోనైన నిధులు ఇస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

వందేభారత్ వచ్చేనా?

కామారెడ్డి-నిజామాబాద్-సిరిసిల్ల-మెదక్-సిద్దిపేట జిల్లాలకు చెందిన వేలాది మంది ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి దేశ వాణిజ్య రాజధాని ముంబాయి మధ్య దేవగిరి ఎక్స్‌ప్రెస్ నడుస్తుంది. నిత్యం వందలాది మంది ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రయణిస్తుంటారు. ఈ మార్గంలో వందేభారత్ రైలు నడిపితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వం వందేభారత్ రైలు మంజూరు చేయాలని ఇక్కడి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అశోక్‌నగర్, నర్సన్నపల్లిలో ఆర్‌వోబీ మంజూరయ్యేనా?

జాతీయ రహదారిపై రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైల్వేబ్రిడ్జీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలో అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదేమార్గం గుండా జిల్లా కలెక్టరేట్, ఎస్పీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ఉండడం, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గం కావడంతో రైళ్లు వచ్చి పోయే సమయంలో గేటు పడడంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైల్వేగేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు చేయాలని ప్రతిపాదనలు సైతం తయారు చేశారు. దీనికి కేంద్రం ఈ బడ్జెట్‌లో ఆమోదించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా నర్సన్నపల్లి వద్ద జాతీయ రహదారిపై ఉన్న రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ లేదా అండర్ పాసింగ్ బ్రిడ్జి వేయాలని వాహనదారుల నుంచి డిమాండ్ వస్తోంది.



కామారెడ్డిలోని అశోక్‌నగర్ రైల్వేగేటు వద్ద ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

మున్సిపల్ కార్మికులకు ప్రతీనెల వేతనాలు చెల్లించాలి

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు తయారు చేయాలి
- వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి
- కార్మికుల పీఎఫ్ డబ్బులు త్వరలోనే జమ చేసేలా చర్యలు చేపడతాం
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 31: మున్సిపల్ కార్మికుల వేతనాలు ప్రతీనెల చెల్లించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్‌లోని ఆయా శాఖలకు సంబంధించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనరల్ ఫండ్ ఎంత ఉంది, అందులో నుంచి మున్సిపల్ కార్మికులకు ఎందుకు జీతాలు చెల్లించడంలో జాప్యం జరుగుతుందని కమిషనర్‌ను ప్రశ్నించారు. అదే విధంగా మున్సిపల్‌లోని ఖాళీ స్థలాల్లో ఎవరైన కబ్జా చేసినట్లయితే వారికి నోటీసులు అందించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. డైలీ మార్కెట్ ఒక్కటే ఉండడం వల్ల ప్రజలతో పాటు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా వార్డుల్లో సైతం మార్కెట్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు నా దృష్టికి వచ్చిందని అందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. వేసవి కాలంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం క్యాంప్ కార్యాలయం వద్దే వేచి చూస్తున్న కార్మికుల వద్దకు వచ్చి ఈ నెలలోపు రెండు నెలల జీతాలు అందేలా అధికారులకు సూచించానని తెలిపారు. పీఎఫ్ డబ్బు లు సైతం త్వరలోనే అందేలా పాలకవర్గంతో పాటు అధికారులతో సమావేశ మై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, డీఈ వాసుదేవరెడ్డి, సానిటరి ఇన్స్‌పెక్టర్లు రవీందర్, పర్వేజ్, ఆర్‌ఐ జానయ్య, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సైన్స్ ల్యాబ్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- జిల్లాలో 50 కేంద్రాల ఏర్పాటు
- మూడు విడతల్లో పరీక్షలు
- మొదటి విడతలో 22 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 12,785 మంది విద్యార్థులు
- అరగంట ముందు ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం

కామారెడ్డి టౌన్, జనవరి 31: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు మొదలుకానున్నాయి. జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్, అనుబంధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 84 ఉన్నాయి. మొత్తం 12,785 మంది ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 5,149 మంది ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం 7,636 మంది ఉన్నారు. ఈ మేరకు గురువారం నుంచి ఈనెల 15వ తేది వరకు ప్రాక్టికల్ పరీక్షలను మూడు విడతలుగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 22 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా కామారెడ్డిలో ఉన్న బ్రిడ్జి కోర్సులో 1,677 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం

ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో పాటు ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఈ మార్కులు థియరీ పరీక్షల ఫలితాల తర్వాత యాడ్ అవుతాయి కాబట్టి విద్యార్థులు వైవాతో పాటు ప్రయోగాలను చేసి చూపుతునే ఎక్కువ మార్కులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అయితే ఈ పరీక్షలకు గంట ముందే విద్యార్థులు పరీక్షలు చేరుకోవాల్సి ఉండగా పరీక్షలు పారదర్శకంగా జరిగేలా అరగంటముందే ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. పరీక్ష కేంద్రంలో ఎగ్జామినర్ సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా ప్రశ్నాపత్రాన్ని ప్రింట్ తీసే వెసులుబాటు లభిస్తోంది. కాగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగనున్నాయి.

తనిఖీలకు బృందాలు

జనరల్, ఒకేషనల్ విభాగాల విద్యార్థులకు మూడు విడతలుగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. వీటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని సైతం నియమించారు. ఒక్కో బృందంలో ఒక అధ్యాపకుడు ఉంటారు. అలాగే డీఈసీ కమిటీ సభ్యులుగా ఒక ప్రిన్సిపాల్, ఒక లెక్చరర్ వ్యవహరించనున్నారు. ఇక 9 మంది అధ్యాపకులను డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా నియమించారు.

సన్నద్ధత లేకుండానే..

జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో ప్రాక్టికల్స్‌కు సంబంధించిన సామగ్రి పూర్తిస్థాయిలో లేదని తెలుస్తోంది. అలాగే తరగతులు కూడా సక్రమంగా నిర్వహించలేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ పరికరాలు, రసాయనాల కొరత నేపథ్యంలో తూతూ మంత్రంగా తరగతులు నిర్వహించారని సమాచారం. సరైన సన్నద్ధత లేకుండానే విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా ఫలితాల విషయమై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాహనదారులూ.. జర జాగ్రత్త

- ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- భిక్కనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జనవరిలో 53 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- 123 వాహనాలు సీజ్, 1,746 ఓవర్ స్పీడ్ వాహనాలకు జరిమానాలు

భిక్కనూరు, జనవరి 31: కొందరు వాహనదారుల చేస్తున్న చిన్న తప్పిదాలతో రోజుకు ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో మరణించిన, గాయపడిన వారి చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితి. ఈ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించి ట్రాఫిక్ రూల్స్ పాటించని, హెల్మెట్, సీట్ బెల్టు ధరించని, వాహనాల నెంబర్ ప్లేట్లు లేకపోయిన, సరిగ్గా పెట్టుకోకపోయిన, రాష్ డ్రైవింగ్ చేసిన, మద్యం తాగి వాహనాలు నడిపే వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. వారిపై కేసులు నమోదు చేయడం, వాహనాలను సీజ్ చేయడం, జైలు శిక్ష పడేలా చేస్తున్నారు. ప్రతిరోజూ జాతీయ రహదారిపై, గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపడుతూ వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. అయినా వాహనదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో కేవలం జనవరి నెలలో 123 వాహనాలు సీజ్ చేయడంతో పాటుగా 120 మంది వాహనదారులపై కేసు నమోదు అయ్యాయి.

హెల్మెట్ ధరించని 451 ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ ధరించని వారే మృతి చెందుతున్నది వాస్తవం. ఈ విషయమై ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ద్విచక్రవాహనదారుల్లో మార్పు కనబడటం లేదు. పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న దారి గుండా కాకుండా ఇతర దారుల్లో వెళ్లటం, వాహనాల తనిఖీ చేసేంత వరకు రోడ్డు పక్కన వాహనాన్ని నిలుపుకుంటున్నారు కానీ హెల్మెట్ మాత్రం చాలా మంది ద్వి చక్ర వాహనదారులు ఉపయోగించడం లేదు. కేవలం జనవరిలోనే భిక్కనూరు పోలీసుస్టేషన్ పరిధిలో హెల్మెట్ ధరించని 451 ద్విచక్రవాహనదారులకు జరిమానాలు విధించారు.

పోలీసుల నుంచి చలన్లు తప్పించుకోవడానికి చిత్రవిచిత్ర వేషాలు

పోలీసుల చలాన్లు తప్పించుకోవడానికి వాహనదారులు చిత్ర విచిత్ర వేషాలు వేస్తున్నారు. వాహనాల నెంబర్ ప్లేట్‌ను పూర్తిగా తొలగించడం, నెంబర్ ప్లేట్‌పై ఉన్న చివరి నెంబర్‌ను తొలగించడం, నెంబర్ ప్లేట్‌ను సగం వరకు వంచడం, నెంబర్ సరిగ్గా కన్పించకుండా చిన్నగా రాయించడంతో పాటుగా వాహన నెంబర్ కన్పించకుండా కవర్లు, ఇతరాత్రాల వాటిని కప్పి ఉంచుతున్నారు. వాహనదారులు ఎన్ని వేషాలు వేసిన పోలీసులు మాత్రం అస్సలు తగ్గదేలే అంటున్నారు. ఒక్క నెలలోనే నెంబర్ ప్లేట్ లేని, సరిగ్గా లేని ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల 56 వాహనాలకు జరిమానాలు విధించడంతో పాటుగా 5 వాహనాలను సీజ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వాహనాలకు జరిమానాలు

మద్యం తాగి వాహనాలు నడిపినా, ఎక్కడపడితే అక్కడ మద్యం సిట్టింగ్‌లు చేసినా, వాహనాలను ఓవర్ స్పీడ్‌గా నడిపినా, రాష్ డ్రైవింగ్ చేసినా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకోలేరు. రహదారిపై ఓవర్ లేజర్ గన్‌తో ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానాలు విధించడంతో పాటుగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, బహిరంగంగా మద్యం తాగే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. జనవరిలో భిక్కనూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న 1746 వాహనాలకు భారీగా జరిమానాలను విధించారు. అనుమతి లేని బహిరంగా ప్రదేశాల్లో మద్యం తాగిన 67 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటుగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 53 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటుగా 53 వాహనాలను సీజ్ చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే పట్టణాల అభివృద్ధి : తూము పద్మ

బోధన్ రూరల్, జనవరి 31 : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పట్టణాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ నెలవారి సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వార్డులు చేసిన అభివృద్ధిని కౌన్సిలర్లకు వివరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ 28 ఏజెండా అంశాలకు మున్సిపల్ తీర్మానం చేసిందన్నారు. ఇందులో మున్సిపల్ డీఈ శివానందం, కౌన్సిలర్లు శ్రీకాంత్‌గౌడ్, పిట్ల సత్యం, దప్పు, అబ్దుల్ జావీద్, అబ్దుల్లా, హబీబ్‌ఖాన్, చిన్న, దూప్‌సింగ్, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

బోధన్ రూరల్, జనవరి 31: సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్‌తో పాటు సొసైటీ డైరెక్టర్లు, ఎంపీటీసీతో పాటు పలువురు బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరామన్నారు. ఆయన వెంట సొసైటీ డైరెక్టర్లు కన్నె రమేష్, లింబయ్య, ఎంపీటీసీ కన్నెల సవిత, మాజీ ఉప సర్పంచ్ డిస్కో సాయిలు తదితరులు ఉన్నారు.

రెంజల్: మండల కేంద్రానికి చెందిన మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ రమేష్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకుడు సాయా గౌడ్ బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సర్పంచ్ రమేష్ కుమార్ తెలిపారు. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యుడు నర్సయ్య, ప్రవీణ్, ప్రభాకర్‌లు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఇందులో మండల అధ్యక్షుడు మొబీన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, అంతిరెడ్డి రాజిరెడ్డి, సాయి రెడ్డి, హన్మంత్ రావు, శ్రీనివాస్, సురేష్‌పటేల్, తదితరులు ఉన్నారు.

'ఇనుము ధరల పెరుగుదలను నియంత్రించాలి'

పెద్దబజార్, జనవరి 31: ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంట్ ధరల పెరుగుదలను నియంత్రించాలని తెలంగాణా బిల్డింగ్ నిర్మాణ రంగం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్‌జహాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏసీఎల్ కార్యాలయంలో కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ కార్మిక చట్టాల సవరణ ఆపాలని ప్రైవేటీకరణను నిర్మించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణాలకు కావలసిన ముడిసరుకు ధరలను పెంచడం వల్ల సామాన్యులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించేందుకు కృషి చేయాలని తెలిపారు. అంతేకాకుండా నిర్మాణ కార్మికుడు ప్రమాదంలో మృతి చెందితే ఇచ్చే సహాయాన్ని 6లక్షల నుంచి 10లక్షల వరకు పెంచాలని అన్నారు. ఖాళీగా ఉన్నటువంటి ఏసీఎల్, డీసీఎల్ ఏఎల్‌వో, జూనియర్ సీనియర్ అసిస్టెంటెంట్ వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ యూనియన్ నాయకులు కృష్ణ, శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

4న ప్రతిభ కళాశాల ప్రవేశ పరీక్ష

● ఆర్సీవో అలివేలు

డిచ్‌పల్లి, జనవరి 31: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియేట్ ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష సీవోఈ సెట్ 2024 ఈ నెల 4న (ఆదివారం) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రవేశ పరీక్ష ఎంపిక చేయబడిన కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని ప్రాంతీయ సమన్వయకర్త అలివేలు, ప్రిన్సిపాల్ సంగీతలు ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈ పరీక్ష టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ధర్మారం(బి), కంజర, ఆర్మూర్, సుద్దపల్లి, పోచంపాడ్, నవీపేట, కామారెడ్డి జిలాల్లో టీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్(జేసీ) ఎల్లారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, తాడ్వాయి, తాడ్కోల్, కోయగుట్ట, తక్కడపల్లి, పెద్ద కొడప్‌గల్, కామారెడ్డి డిగ్రీ కళాశాల,పెద్ద ఎక్లార, బాన్సువాడ (బోర్గాం), నిర్మల్ జిల్లాలో ముథోల్, లెఫ్ట్ పోచంపాడు, జామ్, కడెం, భైంసా, ఈ పరీక్ష నిర్వహించడ బడుతుందని ప్రాంతీయ సమన్వకర్త అలివేలు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్‌లను అంతర్జాలం నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష సకాలంలో హాజరుకా వాలని, గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆర్సీవో సూచించారు. పరీక్ష ప్యాడు, బ్లూ,ఆర్ బ్లాక్ పెన్, వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడ!?

● మాజీ మంత్రి , బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి31: ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలే వ్యతిరేకిస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేములప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని ఎఎస్‌జీ గార్డెన్‌లో బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేస్తున్నది జోడో యాత్రకాదని, కాంగ్రెస్ జోడో యాత్రగా అభివర్ణించారు. ఒక వైపు రాహుల్ గాంధీ జోడో యాత్ర చేస్తుంటే మరో వైపు ఇండియా కూటమి నుంచి ఇతర పార్టీలు కాంగ్రెస్ జోడో యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని యాత్రలు చేసిన దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే హామీలు పూర్తిగా నెరవేరుతాయని సీఎం అనడం హామీల అమలు నుంచి పారిపోవడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న హామీలను పార్లమెంట్ ఎన్నికల లోపు అమలు చేయాలన్నారు. తెలంగాణ వనరులు దోపిడీకి గురవుతున్న వేళ అవిశ్రాంత పోరాటం చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిన నిలిపిన కేసీఆర్‌కు సరైన గౌరవం దగలేదన్న భావన ప్రజల్లో ఉందన్నారు. స్వల్ప ఓట్ల తేడాతో మాత్రమే ఓడిపోయామని, ప్రజలు తమను తిరస్కరించలేదని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల ఉంటుందని నమ్మకం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ధర్మబద్ధంగా నడలేదని, అబద్ధాపు ప్రచారాలతో ప్రజలను నమ్మించారని అన్నారు. వారి అబద్ధాపు ప్రచారాలను తాము పసిగట్టలేకపోయామన్నారు. అధికారంలోకి వచ్చిన కేవలం 50రోజుల్లో రూ.14వేల కోట్ల అప్పులు ఎందుకు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు, మాట్లాడిన వీడియోలయను స్క్రీన్‌పై ప్రదర్శించారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజలు లబ్ధిపొందాలి

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్ పాలనలో ప్రజలు లబ్ధిపొందాలని కార్యకర్తలు నిస్వార్థంగా పని చేశారని ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని, కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రైతుల ఆత్మహత్యలు తగ్గయన్నారు. 24గంటలు ఉచిత కరెంటు ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీల అమలుపై నిలదీస్తే సమాధానం చెప్పలేక ఆక్రోశంతో వ్యవహరిస్తున్నారని దుయ్యాబట్టారు. కాళేశ్వరంపై ఇష్టరీతిలో తప్పుడు ప్రచారం చేసి ప్రజలను నమ్మించారని రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ హయంలో ఉద్యోగాలు ఇవ్వలేదని, తప్పుడు ప్రచారం చేశారని, రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించింది బీఆర్ఎస్ ప్రభుత్వమైతే కాంగ్రెస్ వాళ్ల తామే ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మధుశేఖర్, కోటపాటి నర్సింహంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పోచారం కుటుంబం నుంచి తెలంగాణ తిరుమలకు విముక్తి కల్పించాలి



ఎండోమెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీఎమ్మెల్యే యెండల

నిజామాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోచారం కుటుంబ నుంచితెలంగాణతిరుమలకు విముక్తికల్పించాలని మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గల తెలంగాణ తిరుమల దేవాలయానికి అన్ని తామే అన్నట్లుగా పోచారం కుటుంబం వ్యవహరించాడాన్ని ఆయన తప్పుపడుతున్నామన్నారు. తన కుటుంబసభ్యులను శాశ్వత ట్రస్టీలుగా నియమించుకోవడాన్ని అందుకోసం గత ప్రభుత్వం జారీచేసిన జీవోలను రద్దుచేసి వెంటనే ఆ దేవాలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రత్యేక అధికారిని లేదా ఎగ్జిక్యూటివ్ అధికారిని వెంటనే నియమించి ఆలయ పరిరక్షణకు,ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా నిధులు, ఆలయ కార్యక్రమాలు జరిగేలాగా దేవాదాయశాఖ పూర్తి బాధ్యతలను తీసుకునేలా ప్రత్యేక జీవో రూపొందించి ధర్మకర్తలుగా ఉన్న పోచారం కుటుంబ సభ్యులను తొలగించాలని ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌కు హైదరాబాద్‌లో ఆయన వినతి పత్రం అందించారు.

రేకులపల్లిలో వేములపల్లి కిరణ్ వర్ధంతి

ధర్పల్లి, జనవరి31: మండలంలోని రేకులపల్లి గ్రామంలో ప్రగతి శీల యువజన సంఘం జిల్లా టెలికన్వీనర్ కామ్రేడ్ వేములపల్లి కిరణ్‌కుమార్ 33వ వర్ధంతిని బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ చిత్రపటతానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి కారల్‌మార్క్ మాట్లాడుతూ కిరణ్‌కుమార్ చిన్నతనం నుంచే ఉద్యమాల వైపు ఆకర్షితుడై నూతన సమాజం ఏర్పడడానికి క్రియాశీల పాత్ర పోషించాడన్నారు. 23ఏళ్లలోనే జిల్లాలోని గ్రామ గ్రామానికి తిరిగి యువకులను ఏకతాటిపైకి తెచ్చ యువజన సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ మండల నాయకులు సాయికుమార్, జాగీర్, సాంబయ్య, శివరాజ, రాములు, నర్సాగౌడ్, గంగాధర్, దేవదాస్, గంగారాం, గంగాధర్, జగన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ కళాశాలలో వీడ్కోల సమావేశం

ముప్కాల్, జనవరి31: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ విద్యార్థులు బుధవారం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అర్గుల చిన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు వివరించారు. చదివిన కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించారు.ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన భృతిని ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలి

● తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 31:బీడీ పరిశ్రమలో పని చేస్తున్న రకాల క్యాటగిరీలకు చెందిన వారికి రూ.4000 జీవనభృతి ఎలాంటి ఆంక్ష లు లేకుండా ఇవ్వాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శుడు భూమేశ్వర్, సూర్యశివాజీలు అన్నారు. బుధవారం నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గడచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి జీవోను తీసుకురాలేదు కాబట్టి కార్మికులు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి రాగానే జీవనభృతి ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని అన్నారు.జనవరి 30న రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి మెమోరండాం ఇవ్వడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు భూమన్న, శివకుమార్, గంగాధర్, సుప్రియ, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

మోస్రా,జనవరి31: మోస్రా మండలంలోని చే నెంబర్ తండాలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల ఎదుగుదల, బరువు కొలతలు పరిశీలించారు. ప్రతి సెంటర్‌లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికారులు ప్రతాప్, ఉమేష్, సీడీపీవో జానకి, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంబాబు,సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, జనవరి31: ఆర్మూర్ మండలం దేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో రాజగంగారాం, జెవీ.అనురాధ, ఎస్.శ్రీనివాసులను గ్రామస్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం సరోజ, ఎంపీటీసీ అనుష శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్ గడ్డం గంగారెడ్డి, హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ సంఘ భవనానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్, జనవరి31: ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో బుధవారం గ్రామ మహిళా సంఘ భవనం మరమ్మతు పనులకు సర్పంచ్ గడ్డం సరోజ గంగారెడ్డి భూమిపూజ చేశారు. మహిళ భవనం మరమ్మతులకు ఎంపీ ల్యాండ్ నిధులు రూ.4లక్షలు ఎంపీ ధర్మపురి అర్వింద్ మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసి ఎంపీ అర్వింద్, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీటీసీ మణిదీపిక, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

● ఒలంపిక్ సంఘ అధ్యక్షుడు ఈగసంజీవరెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 31 :క్రీడా సంఘాలను కలుపుకుని క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆర్చరీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఈగసంజీ వరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఒలంపిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఈగసంజీవరెడ్డిని ఒలంపిక్ సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. అనంతరం ఈగసంజీవరెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులకు చేయూత నిస్తూ క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేద్దా మన్నారు..ఈకార్యక్రమంలో ఒలంపిక్ సంఘ కార్యదర్శి బొబ్బిలి నర్స య్య, కోశాధికారి భూమరెడ్డి,ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి,సంయుక్త కార్యదర్శులు విజయ్‌కాంత్, రాజగౌడ్,అబ్దుల్ ఉమర్, కార్యవర్గ సభ్యులు యాసిన్, మనోజ్‌కుమార్, సురేష్, జావెద్,సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరోనో కష్టకాలంలో సర్పంచ్‌ల సేవలు మరువలేనివి :ఎంపీపీ

బోధన్ రూరల్, జనవరి 31: కరోనా మహమ్మరీ వంటి కష్ట కాలంలో సర్పంచ్‌లు గ్రామస్థులకు చేసిన సేవలు మరువలేనివని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ అన్నారు. బుధవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌ల పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించడం అభినం దనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగా రెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీగిర్దావర్ గంగారెడ్డి,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శ్రీని వాస్ రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు జయశ్రీ భూమారెడ్డి, పంచా యతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు సురేష్, పంచాయితీ ఏఈ సాయిలు, ఎంపీడీవో వర్సన్న, ఎంపీవో మధుకర్‌లతో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో నారాయణ విద్యార్థులు

పెర్కిట్, జనవరి31: ఆర్మూర్ పట్టణంలోని నారాయణ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రిషీ ఆత్రేయ, నిఖిల్ చంద్ర విద్యార్థులు అండర్-14 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు రజనీకుమారీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 16నుంచి 18వ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి ఫిబ్రవరి 3వ తేదీన జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనడం పట్ల విద్యార్థులను అభినందించారు. అదే విధంగా నారాయణ విద్యాసంస్థల తెలంగాణ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శివాజీ, పీఈటీలు రజీత మోహన్‌లు విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన మెడికల్ ఆఫీసర్

ముప్కాల్, జనవరి31: బాల్కొండ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం కాయకల్ప కార్యక్రమంలో భాగంగా గాంధారి మెడికల్ ఆఫీసర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గల వసతులు రోగులకు ఏలా అందుతున్నాయో పరిశీలించారు. ఆసుపత్రిలో నీటి వసతి, తగిన మందులు, ఎంత మంది సిబ్బంది ఉన్నారో అధ్యాయనం చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ వైద్యులు అనిల్ కుమార్, శృతి, రక్షిత, స్టాఫ్ నర్సు, ల్యాబ్ సిబ్బంది, పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ముప్కాల్, జనవరి31: బాల్కొండ మండల కేంద్రంలోని 1033 సర్వే నెంబర్ స్థలం కబ్జాకు గురైనట్లు తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గందం వెంక టేశ్వర్ స్థానిక తహసీల్దార్‌తో కలిసి సర్వేచేశారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థల సరిహద్దులను పరిశీలించారు. గురువారం నుంచి ఎండో మెంట్ సర్వే చేపడతామని డిప్యూటీ ఇన్స్‌పెక్టార్ ఆఫ్ సర్వేయర్ గందం వెంక టేశ్వర్ తెలిపారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం : ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్,జనవరి31: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వీరన్నగుట్ట తండా, రెంజల్, సాటాపూర్, బోర్గాం, తాడ్‌బిలోలి, దండిగుట్ట, దూపల్లి గ్రామాలలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటి సారి మండలానికి రావడంతో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. వీరన్నగుట్ట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విద్యార్థులతో ముచ్చటించి పాఠశాలకు అవసరమైన సదుపాయల గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉందని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 7వ తరగతి చదువుతున్న వినయ్ అనే విద్యార్థి జన్మదినం ఉండడంతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖజనాను ఖాళీ చేసి అప్పుల రాష్ట్రంగా మార్చిందని, రాష్ట్ర విభజన తర్వాత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను 10సంవత్సరాలలో అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తే లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ ఇప్పటి వరకు అమలు చేస్తూ వస్తుందని మిగత పథకాలను త్వరలోనే అమలు చేస్తామన్నారు. రైతు శ్రేయసు కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని, గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించడానికి ఎంతగానో ఉపయోగపడిందని, ప్రాజెక్టులు కట్టిన పార్టీ కాంగ్రెస్‌పార్టీ అని, పేదల కోసం పాటుపడే పార్టీ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ప్రజలు 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు మోసపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తోందని అన్నారు. ప్రజల సమస్యల కోసం అధికారులు ప్రజా సమస్యలను స్వీకరించి పరిష్కార దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాములు, సాయారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ధనుంజయ్, అంతిరెడ్డి రాజిరెడ్డి, జావీదోద్దీన్, నితిన్, రెంజల్ సర్పంచ్ రమేష్ కుమార్, వీరన్నగుట్ట సర్పంచ్ రాజు, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ రాంచందర్, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, పాల్గొన్నారు.

4న విద్యార్థులకు మోడల్ పరీక్ష

బాన్సువాడ టౌన్, జనవరి 31: గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థులను సమాయత్తం చేసేందుకు గాను ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న పట్టణంలోని సాయికీర్తి జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు సంతోష్ తెలిపాడు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయం పోగొట్టేందుకు విద్యార్థులకు మోడల్ పరీక్షతో పాటు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు మోడల్ పరీక్ష రాసేందుకు 7386965601 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సాయిలు, బాల్‌రాజ్, సాయికుమార్, కల్లేటి సాయిలు, పర్వయ్య, రాజు తదితరులున్నారు.

ఫ్లెక్సీల చించివేతపై ఇరు వర్గాల మధ్య గొడవ

బీర్కూర్, జనవరి 31: మండలంలోని బైరాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి ఫ్లెక్సీల చించివేతపై ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. అర్ధరాత్రి వేళ గొడవ పెరిగి పెద్దది కావడంతో పోలీసులు చేరుకుని ఇరు వర్గాలను సముదాయించి పంపించారు. బైరాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగ నిర్వహించారు. అయితే బోనాలు ఎత్తే విషయంలో ఇరువర్గాల వారు తమ నాయకుడు అంటే తమ నాయకుడు మొదట బోనం ఎత్తాలి అంటూ వాగ్వాదానికి దిగారు. గొడవ పెరిగి ఒకరి ఫ్లెక్సీలను ఒకరు చించుకున్నారు. చివరకు పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు.

బాన్సువాడ రూరల్ సీఐగా సత్యనారాయణగౌడ్

బాన్సువాడ టౌన్, జనవరి 31: బాన్సువాడ రూరల్ సీఐగా సంపంగి సత్యనారాయణ గౌడ్ బుధవారం బాన్సువాడ రూరల్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు పని చేసిన సీఐ మురళీ బదిలీపై హైదరాబాద్ వెళ్లగా ఆయన స్థానంలో ఇంటలిజెన్స్ విభాగంలో జోనల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సత్యనారాయణ బాధ్యతలను స్వీకరించారు.

సదాశివనగర్ సీఐగా సంతోష్‌కుమార్

సదాశివనగర్, జనవరి 31: సదాశివనగర్ సీఐగా సంతోష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహించి బదిలీపై మండలానికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ రామన్ బదిలీపై హైదరాబాద్ వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీసులకు ప్రజలు సహకరిస్తే నేర నియంత్రణ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఓటీఎస్ పథకం గడువు మార్చి 31 వరకు పెంపు

బాన్సువాడ టౌన్, జనవరి 31: నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఓటీఎస్ గడువును మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లోన్లు తీసుకున్న రైతుల అభ్యర్థన మేరకు ప్రవేశపెట్టిన ఓటీఎస్ పథకం జనవరి 31నముగియడంతో, పాలకవర్గం సమావేశంలో ఈ పథకం గడువును మార్చి 31, 2024 వరకు పొడిగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్చి 31 నాటికి కాలపరిమితి ముగిసి బ్యాంకు ద్వారా బట్వాడా చేయబడిన, సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలపై అపరాధ వడ్డీ 100 శాతం మాఫీ, వాయిదా మీరిన వడ్డీపైన 30 శాతం మాఫీ చేయబడునని, అదేవిధంగా ఎస్ఎఫ్ఎస్, మార్టిగేజ్, ఎల్‌టీ లోన్స్, జేఎల్‌జీ, ఎస్‌హెచ్‌జీ రుణాలపై వడ్డీని 32 శాతం మాఫీ చేయబడునని ఆయన పేర్కొన్నారు. అర్హులైన రుణగ్రహీతలు ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సంబంధిత సొసైటీలను, బ్రాంచ్ మేనేజర్లను సంప్రదించాలన్నారు.

జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డి టౌన్, జనవరి 31: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించినా నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

నసురుల్లాబాద్, జనవరి 31 : మండలంలోని దుర్కి గ్రామంలో గల మామిడి రాములు(65) అనే వృద్ధుడు అనారోగ్యం కారణంతో మంగళవారం రాత్రి జీవితంపై విరక్తి చెంది తన ఇంటి దగ్గరలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ లావణ్య తెలిపారు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

బీర్కూర్, జనవరి 31: మండలంలోని బైరాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక వంటకాలను తయారు చేశారు. మహిళలు బోనాలతో బాజా భజంత్రీల మధ్య అమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు, బోనాలు సమర్పించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పిల్లా పాపలతో, ఆయురారోగ్యాలతో పాడి పంటలు పచ్చగా కళకళలాడుతూ ఉండాలని గ్రామస్థులు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మొగులు గోండ, రామాగౌడ్, రమేష్‌గౌడ్, చిన్న సాయాగౌడ్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

రామారెడ్డి, జనవరి 31: ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధుశ్రీవాత్సవ అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు సైన్స్, మ్యూజిక్, డ్యాన్స్, గణితం పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లెక్చరర్‌లు నాగరాజు, వెంకటరాజు, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

పెద్ద కొడప్‌గల్, జనవరి 31: జుక్కల్ మండలంలో రానున్న వేసవి కాలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఉపాధి హామీ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయన్న పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి హాజరై అధికారులనుద్దేశించి మాట్లాడారు. ముందుగా 2022-23 సంవత్సరానికి గాను మండలంలో 420 పనులకు గాను రూ.2కోట్ల 90లక్షల 485 నిధులతో పనులు చేయించామని, వాటికి సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. సామాజిక తనిఖీ సిబ్బంది మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు, మూడు రోజులుగా తనిఖీ నిర్వహించి ఆ గ్రామాల్లో పనులపై గ్రామస్థాయిలో ప్రజావేదిక నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండలంలో అక్కడక్కడ గ్రామాల్లో ఉపాధి పనులలో తప్పులు జరిగాయని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. కూలీలు ఉపాధి పనులు చేయగానే వారి కూలీ డబ్బులను వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో వేసవి కాలం వస్తున్నందున కూలీలు పనులలో ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా సిబ్బంది చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల ప్రకారం ఉపాధి కూలి చెల్లింపు

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు కొలతల ప్రకారం డబ్బులు చెల్లించడం



బూర్గుపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంఈడీవో రాణి

జరుగుతుందని ఎంపీడీవో రాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాణి మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులు చేసే సమయంలో నిర్ణీత సమయానికి పనులు జరిగే చోటుకు చేరుకోవాలని సూచించారు. పనులు చేసిన కూలీలకు కొలతల ప్రకారం డబ్బులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం మండలంలో కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడం జరిగిందని తెలిపారు. ఇంకా గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న చోట ఆ గ్రామంలోని కూలీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుదర్శన్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి సాయిలు, ఫీల్డ్ అసిస్టెంట్ విలాస్ రావ్ తెలిపారు.



అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

గ్రామాల్లో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

నిజాంసాగర్, జనవరి 31: గ్రామాల్లో అభివృద్ధి పనులపై ఎంపీడీవో అబ్బాగౌడ్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని, రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా నీటి సమస్య తలెత్త వద్దన్నారు. అలాగే వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. హరితహారం నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్, సీడ్ ఫిల్లింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో శ్రీనివాస్, ఆయా గ్రామాల కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట, జనవరి 31: ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఆయన బుధవారం మండలంలో 2 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని బొల్లారం గ్రామంలో కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. గ్రామంలో 15 లక్షల రూపాయలతో మెటల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ధర్మారెడ్డి వెంకంపల్లి గ్రామాల్లో 20 లక్షల చొప్పున 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేసిన నూతన గ్రామ పంచాయితీ భవనాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పథకం ద్వారా నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలను మంజూరు చేశారని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రభుత్వ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడవద్దని, అవినీతికి పాల్పడితే అలాంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. తాండూరు నుంచి వెంకంపల్లి వరకు నిర్మించిన రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. వెంకంపల్లి బ్రిడ్జి అవతలి వైపు మెదక్ జిల్లాలో నిర్మించనున్న రోడ్డు విషయంలో మెదక్ జిల్లాల ప్రజా ప్రతినిధులతో, అధికారులతో సంప్రదించి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పోచారం ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, సొసైటీ అధ్యక్షులు గంగారెడ్డి, సర్పంచ్‌లు వీణ ధనుంజయ్, శ్రీధర్‌గౌడ్, సుభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, పాల్గొన్నారు.



బొల్లారంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన మండలంలోని బొల్లారం హైస్కూల్‌కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఎం.సురేఖకు బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఘనంగా సన్మానించారు. బొల్లారం హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని అథ్లెటిక్స్ (లాంగ్ జంప్)లో తన ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఫిబ్రవరి 16 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆమె పాల్గొననుంది. విద్యార్థిని జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు విద్యార్థిని ఘనంగా సన్మానించారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బిచ్కుంద, జనవరి 31: సెల్‌ఫోన్‌లలో దొంగ ప్రకటనలు పంపిస్తు ఆన్‌లైన్ మోసాలు చేసేవారిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మురళి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. దొంగలు ద్విచక్రవాహనాలు దొంగతనాలు చేస్తు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతుంటారని వాహనదారులందరూ తప్పకుండా నంబర్ ప్లేట్‌లను తప్పకుండా బిగించాలని లేకపోతే భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు.100 వరకు వాహనాలు తనిఖీ చేసి అందులో సగంకు పైగా లైసెన్స్ నంబర్ ప్లేట్స్ వాహనపత్రాలు లేని వారికి జరిమానాలు విధించడం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు.

కోనాపూర్ పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

బీబీపేట, జనవరి 31: మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు నాయనమ్మ గ్రామం కోనాపూర్‌లో సుమారు రూ.2.5 కోట్ల సొంత నిధులతో నిర్మించిన పాఠశాలను సర్పంచ్ చెప్యాల నర్సవ్వ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్ తన పూర్వికుల గ్రామమైన కోనాపూర్‌ను దత్తత తీసుకుని పాఠశాల, వైద్య శాఖ, గ్రామ పంచాయతీ భవనం, లైబ్రరీ, సీసీ రోడ్లు కోనాపూర్, అంబర్‌పేట్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం వంటి పనులతో గ్రామంలో అన్ని పనులు పూర్తి అయ్యాయని అన్నారు. జడ్పీవైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యతోనే జ్ఞానం వికసిస్తుందని అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అన్ని హంగులతో కూడిన పాఠశాలను కట్టించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

బీబీపేట, జనవరి 31: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంను ఎంపీపీ పసులాది బాలమణి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎడ్లకట్టవాగుపై వంతెన లేకపోవడంపై వర్షాకాలంలో వాగు వచ్చినప్పుడు మందాపూర్, జనగామ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు తలెత్తుతున్నాయని మందాపూర్ సర్పంచ్ రేవతిసభ దృష్టికి తెచ్చారు. బీబీపేట నుంచి యాడారం వరకు మాత్రమే బస్సు నడుస్తుందని దానిని శివార్ రాంరెడ్డి పల్లె వరకు నడిచేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ప్రభాకర్ ఆర్‌టీసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో సర్పంచ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు తేలు లక్ష్మీ, ప్రసాద్, పాత రాజు, రేవతి, కవిత, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దోమకొండ, జనవరి 31: మండలంలోని ముత్యంపేట గ్రామంలో గత మూడు రోజుల క్రితం బొబ్బిలి దుర్గయ్య అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రైతు సంక్షేమ సమితి సభ్యులు, రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్ దుర్గయ్య కుటుంబ సభ్యులకు బుధవారం రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఇంద్రసేన, రఘునాథ్, నర్సింహా, నాయక్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ శారద

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

దోమకొండ, జనవరి 31: మండలంలోని అన్ని గ్రామాల్లో రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీపీ కానుగంటి శారద, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.సర్పంచ్‌ల పదవికాలం ముగుస్తున్నందున వచ్చే వేసవికాలంలో గ్రామాల్లో సమస్యలు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాశాఖ అధికారి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ.. పంటలకు సోకుతున్న పురుగు నివారణకు అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఆర్అండ్‌బీ రోడ్ల విషయంలో నిబంధనలను గ్రామ పంచాయతీలకు అందజేయాలని, అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్మించే యజమానులపై చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ అధికారులకు సూచించారు. ప్రజాకవి గద్దర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్‌లను శాలువాతో సన్మానించారు.

ఆరోగ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన

బాన్సువాడటౌన్, జనవరి 31: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, గర్భిణులకు ఆరోగ్యం, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా చిన్నపిల్లలకు వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల లెక్చరర్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్ అరుణ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రాసౌండ్ స్కానర్ ద్వారా గర్భనిర్ధారణ సులువు

సదాశివనగర్, జనవరి 31:పశువుల్లో గర్భనిర్ధారణ చేసుకోవడానికి అల్ట్రాసౌండ్ స్కానర్ ద్వారా సులభతరం అవుతుందని, ఈ విధానంతో స్పష్టమైన గర్భనిర్ధారణ తెలుసుకోవచ్చని జిల్లా పశువైద్య ఆరోగ్య అధికారి సింహారావు అన్నారు. బుధవారం అమర్లబండలో నిర్వహించిన పశువైద్యశిబిరానికి ఆయన ప్రత్యేక అధికారిగా హాజరై మాట్లాడారు. పాడి రైతులు మేలు రకమైన పశు జాతులను ఎన్నుకుంటే అత్యధిక పాల దిగుబడి పొంది ఆర్థికంగా లబ్ధిపొందవచ్చని సింహరావు రైతులకు సూచించారు.



ఎస్ఈకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఆర్టీజన్‌ల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డిటౌన్, జనవరి 31: ఆర్టీజన్‌ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. బుధవారం ఎస్ఈ రమేష్‌బాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఆరున్నర సంవత్సరాల క్రితం విధుల్లోకి చేరిన ఆర్టీజన్‌లకు కమెన్స్‌మెంట్ ఇచ్చినప్పటికీ కంప్లిషన్ ఆఫ్ ప్రొబేషన్ చేయలేదని అన్నారు. దీని కారణంగా సెప్టెంబర్‌లో ఇచ్చే ఇంక్రిమెంట్ ఆగిపోయిందని తెలిపారు. కామారెడ్డి సర్కిల్ పరిధిలోని 135 సబ్‌స్టేషన్‌ల పరిధిలో 540 మంది ఆపరేటర్‌లు, 135 మంది వాచ్‌మెన్‌లు ఉండాలని కానీ 350 మందితో మాత్రమే పనులు చేయిస్తున్నారని తెలిపారు. స్టాండింగ్ ఆర్డర్ చాప్టర్- 2లోని రెగ్యులేషన్ 5 ప్రకారం ఒక్క ఆర్టిజన్ రోజుకు 8 గంటలు అలాగే వారంలో నలభై గంటలు పనిచేయాలని ఉన్న కొంతమంది సబ్‌స్టేషన్ ఆపరేటర్లు విరామం లేకుండా 24 గంటలు పనిచేస్తున్నారని ఇలా అనేక సమస్యలతో కొట్టుమిట్టడుతున్న ఆర్టీజన్ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ చంద్రశేఖర్, గోవర్ధన్, శంకర్, నాగరాజు, రాకేష్, శేఖర్,సంతోష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాం ఎమ్మెల్సీపై కుట్రలు సిగ్గుచేటు

కామారెడ్డిటౌన్, జనవరి 31: ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ వస్తే కుట్రలు చేయడం సిగ్గుచేటని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్‌యాదవ్, టీజేఎసీ చైర్మన్ జగన్నాథం అన్నారు. బుధవారం కామారెడ్డిలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తికి ఎమ్మెల్సీ ఇవ్వడాన్ని ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ కుట్రపూరితంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించిందని అన్నారు. తెలంగాణ ప్రజల నాడి, సమస్యలు తెలిసిన వ్యక్తి చట్టసభల్లోకి వెళ్తె బడుగుబలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇవేమి పట్టని బీఆర్ఎస్ కోదండరాం చట్టసభల్లోకి రాకుండా కుట్ర పన్నుతున్నారని అన్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతిని చట్టసభల్లో నిలదీసి అడిగే దమ్మున్నవ్యక్తి కాబట్టే ఈ విధంగా కుట్రచేస్తున్నారని సమాజం గ్రహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రజినికాంత్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ
ఆధ్వర్యంలోనే గదుల కేటాయింపు

- ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు

మాచారెడ్డి, జనవరి 31: మండలంలోని గజ్యానాయక్‌తండా చౌరస్తాలోని వీర హనుమాన్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన 20 గదులను అప్పుడున్నటువంటి ఈవో ప్రభుత్వం ప్రకటించిన ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే గదులను కేటాయించడం జరిగిందని ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొంత మంది కాంగ్రెస్ నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో ఆలయాల అభివృద్ధి కోసం సహకరించానని తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన 20 షెటర్ల గదులకు 2014లో రూ.1లక్ష 80 వేలు విరాళంగా 20 మంది అందజేశారని అన్నారు. తాను ఎంపీపీగా 2లక్షల 30 వేలను విరాళంగా అందించానని తెలిపారు. అప్పటి ఆలయ కమిటీ చైర్మన్ దాతల సహాయంతోనే ఆ గదులకు స్లాబ్ వేశారన్నారు. అవి పూర్తిగా నిర్మించడానికి మళ్లీ ఒక్కో సభ్యుడు సుమారు నాలుగు లక్ష రూపాయలు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని గదులను పూర్తి చేశారని తెలిపారు. ఇదంతా కూడా ఆలయ కమిటీ ఈవో సమక్షంలోనే జరిగిందన్నారు. ఈ విరాళాలను వీర హనుమాన్ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ మీద బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయడం జరిగిందన్నారు. ట్రెజరీ ద్వారా డబ్బులను బ్యాంక్ అకౌంట్‌లో నుంచి తీసి గదులపైన రూ.35లక్షలు ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. గజ్యానాయక్ తండా గతంలో ఎలా ఉండేనో ప్రస్తుతం ఎలా ఉందో అందరికి తెలుసునని అన్నారు. ప్రతీ దేవాలయానికి విరాళాలను అందజేశానని ఆయన తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	హనుమాన్
శాంతి	గుంటూరు కారం
ప్రియా 70	క్యాప్టెన్ మిల్లర్
ప్రియా 35	అయాలన్

బాన్సువాడ	
మహేశ్వరి	సైంధవ్
వెంకటేశ్వర	నా సామిరంగ

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

